# నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు డీ-వార్మింగ్ మాత్రల పంపిణీ

ఏర్పేడు ,పెన్ పవర్, ఫిబ్రవరి,16 :
తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం మడిబాక గ్రామపంచాయతీ పరిధిలోని రాజుల కండ్రిగ ఆదర్శ పాఠశాలలో నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాల సరస్వతి, ఏఎన్ఎం హైమావతి, ఆశ వర్కర్ వెంకటమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 1 నుంచి 19 ఏళ్ల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం హైమావతి మాట్లాడుతూ నులి పురుగుల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను వివరించి, రక్తహీనత తగ్గింపు, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రత్నకుమార్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా। తిరుపతి జిల్లా। చిత్తూరు జిల్లా। వై.ఎస్.ఆర్. కడప జిల్లా।



# బాల్య వివాహాల నిర్మూలనకు గ్రామాల్లో అవగాహన ర్యాలీ

**- ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి రూరల్‌లో సదస్సు నిర్వహణ**

శ్రీకాళహస్తి రూరల్, పెన్ పవర్, ఫిబ్రవరి,16 :
బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి రూరల్ మండలం బీవీపురం, దొడ్లమిట్ట గిరిజన గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లోపం, మూఢనమ్మకాల కారణంగా బాలికలకు 18 ఏళ్లు నిండకముందే వివాహాలు జరిపిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా 'శ్రీకాళహస్తి దేవుడి పెళ్లి' పేరుతో సామూహిక వివాహాలు నిర్వహించడం చట్ట విరుద్ధమని తెలిపారు. చట్ట ప్రకారం బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం జరిపించాల్సి ఉంటుందని, దీనికి విరుద్ధంగా జరిగితే సహకరించిన వారూ శిక్షార్హులేనని స్పష్టం చేశారు.
పేదరికం, నిరక్షరాస్యత, మేనరికపు వివాహాలు వంటి కారణాలతో బాల్యవివాహాలు జరుగుతున్నాయని పేర్కొంటూ తల్లిదండ్రులు బాలికలను చదివించి వారి భవిష్యత్తు అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బీవీపురం ఆరోగ్య కార్యకర్త నల్లని మాట్లాడుతూ బాల్యవివాహాలు పిల్లల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని వివరించారు. కార్యక్రమంలో సంస్థ కో-కన్వీనర్ రామచంద్ర, అంగన్వాడీ టీచర్ పద్మతో పాటు గ్రామస్తులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం బాల్యవివాహాల నివారణకు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు

# బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా వేణు ముదిరాజ్ నియమాంకం..



రేణిగుంట: ఫిబ్రవరి 17, పెన్ పవర్
తిరుపతి జిల్లా భారతీయ జనతా పార్టీ ఓబిసి మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా రేణిగుంట మండలం కుర్ర కాలువ గ్రామానికి చెందిన యువ నేత కుర్రకాల్వ వేణు ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గోపి ఆచారి అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్న వేణు ముదిరాజును బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ మరియు ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ వంటి సీనియర్ నాయకుల సూచన మేరకు ఈ పదవి ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు పార్టీ అగ్ర నాయకత్వానికి వేణు ముదిరాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో ఓబీసీల సమస్యల పరిష్కారానికి పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు

# హామీలు అమలు చేయాలని పాలచ్చురు గ్రామస్తుల విజ్ఞప్తి

**- పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీ గురుమూర్తి హామీ**

పెళ్లకూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 17
ఏపీఐఐసి కోసం భూసేకరణ సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ పాలచ్చురు గ్రామస్థులు సోమవారం తిరుపతి పార్లమెంట్ సభ్యుడు మద్దిల గురుమూర్తిని కలిసి వినతిపత్రం సమర్పించారు. పెళ్లకూరు మండలం పాలచ్చురు గ్రామ పరిధిలో గల తమ భూములను 2007 సంవత్సరంలో ఏపీఐఐసికి అప్పగించామని, ఆ సమయంలో అప్పటి నెల్లూరు జిల్లా కలెక్టర్ తమకు 0.25 సెంట్ల గృహస్థలం మరియు ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారని గ్రామస్తులు వివరించారు. అయితే ఇంతకాలం గడిచినా ఆ హామీలు అమలు కాలేదని, తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు ఎంపీకి మొరపెట్టుకున్నారు. గ్రామస్తుల సమస్యలను సావధానంగా విన్న ఎంపీ గురుమూర్తి, సంబంధిత అధికారులతో ఈ విషయాన్ని చర్చించి హామీల అమలుకు అవసరమైన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు





# పాముల కట్టడికి ఇకపై సర్పమిత్రల సహాయం

పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 17,
నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో రైతులు తమ పంటపొలాల్లో వ్యవసాయము చేసుకొనే క్రమంలో ఇకపై ఎటువంటి పాము కాటుకు గురికాకుండా అటవీశాఖ అధికారులచే సర్పమిత్ర లను ఏర్పాటు చేస్తున్నామని అనంతపురం సర్కిల్ ఐఎఫ్ఎస్ యశోద బాయ్ అన్నారు. ఇందుకు సంబంధించి సర్కిల్ పరిధిలోని అటవీశాఖ అధికారులకు,సిబ్బందికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం మండలం లోని మామడుగు వద్ద గజారామం నందు ఏర్పాటు చేశారు. ఇందులో ప్రత్యేక నిపుణుల సహాయంతో ఎటువంటి పాముల వలన ప్రాణాపాయము ఉంటుంది,అవి మనిషిని కొరికినపుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి,అలాగే ఎటువంటి ప్రథమ చికిత్స అందించాలి తదితర విషయాలను అధికారులకు తెలియజేసారు. అందుకు సంబంధించిన సర్పమిత్ర ప్రతి గ్రామానికి అందుబాటులో ఉండేలా అన్ని రకాలుగా చర్యలకు ప్రభుత్వం తీసుకొంటుందని,ఈకార్యక్రమాన్ని రాబోయే మార్చిలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీద హనుమాన్ కార్యక్రమం ప్రారంభించబోతు న్నారని అన్నారు. అలాగే ఏనుగుల కట్టడికి రైతుల సహాయ సహకారాలు అవసరం అన్నారు. పంటనష్టం జరగకుండా అన్నిరకాల చర్యలు తీసుకుంటామని, అడవిలో ఏనుగులకు అవసరమైన మేతను పెంపొందించే విదంగా వృక్షాలను పెంచుతూ,వాటి కదలికలపై నిఘా ఉంచామని,అందుకు పలమనేరు ఎఫ్.ఆర్.ఓ.నారాయణ మరియు సిబ్బంది కృషి ఎంతో ఉందని ఆమె కొనియాడారు.
ఇందులో డి.ఎఫ్.ఓ.సుబ్బరాజు,సబ్ డిఎఫ్ఓ వేణుగోపాల్,ఎఫ్ఆర్ఓ నారాయణ,పుంగనూరు ఎఫ్.ఆర్.ఓ.శ్రీరాములు, కుప్పం ఎఫ్.ఆర్.ఓ జయశంకర్,చిత్తూరు రేంజర్ పట్టాభి, కార్వేటినగర్ రేంజర్ థామస్ కుమార్, ఎఫ్.ఎస్.ఓ,ఎఫ్.బిఓ, ఏబిఓ,ఎలిఫెంట్ ట్రాకర్స్,వాలెంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఓ బి సి జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ కు ఘన స్వాగతం.. వేణు ముదిరాజ్ సన్మానం..





రేణిగుంట: ఫిబ్రవరి 17, పెన్ పవర్
బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె లక్ష్మన్ను తిరుపతి జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడుగా నూతనంగా నియమితులైన కుర్ర కాలువ వేణు ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు మంగళవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న లక్ష్మణ్ కు వేణు ముదిరాజ్ ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కే లక్ష్మణ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మరియు ఓబిసి వర్గాల సంక్షేమానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ , బిజెపి యువనేత రాజా రాయల్ మరియు బిజెపి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



# హనుమంతు వాహనంపై శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి శ్రీరామచంద్రుని అలంకారంతో



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 17.
బుచ్చిరెడ్డిపాలెం అర్బన్ ఏరియాలోని రామకృష్ణ నగర్ లో వెలసి ఉన్నటువంటి శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి పదవ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈరోజు హనుమంతు వాహనంపై శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి శ్రీరామచంద్రుని అలంకారంతో గ్రామంలోని పూర్వ ప్రజలకు దర్శనమిచ్చారు.

# ఆన్లైన్ బెట్టింగ్ ముఠా అరెస్ట్.

**7,48,000/- నగదు, ఓ ల్యాప్ టాప్, 4 సెల్ ఫోన్లు, 4 పేటీఎం క్యూఆర్ కోడ్ బాక్సులు స్వాధీనం.**



తిరుపతి,పెన్ పవర్,ఫిబ్రవరి 17.
తిరుపతి నగరంలో ఆన్లైన్ గేమింగ్ నిర్వహిస్తున్న ముఠా పై ఈస్ట్ పోలీసులు దాడులు నిర్వహించారు. ముగ్గురు పట్టుబడగా మరో ఇద్దరు పారిపోయారు. పట్టుబడ్డ నిందితుల వద్ద 7,48 వేల నగదు ఓ ల్యాప్ టాప్, 4 సెల్ ఫోన్ లను, 4 పేటీఎం క్యూఆర్ కూడగలిగిన బాక్సులను స్వాధీనం చేసుకున్నారు, తిరుపతి ఈస్ట్ సిఐ శ్రీనివాసులు కథనం మేరకు..... నగరంలో ఆన్లైన్ గేమింగ్ లు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో నిగా పెట్టడం జరిగిందన్నారు. సోమవారం సాయంత్రం బైరాగి పట్టణంలోని పద్మావతి పార్కు వద్ద ఆన్లైన్ గేమ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై రామస్వామి ప్రసాద్ సిబ్బందితో దాడి చేయడం జరిగిందన్నారు. మొబైల్ ఫోన్లో ప్రత్యేక యాప్ ల ద్వారా క్యాసినో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నట్లు తెలిపారు నిందితుల వద్ద 7,48,000 నగదు తో పాటు వారి వద్ద 4 సెల్ ఫోన్ లను ఓ లాప్టాప్ ను నాలుగు పేటియం క్యూఆర్ కోడ్ బాక్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తిరుపతి నగరంలోని గాంధీ పురం పంచాయతీ, శ్రీనగర్ కాలనీలో నివాసముంటున్న వేముల మణిరత్నం, బైరాగి పట్టెడ జీడి హోమ్స్ లో నివాసముంటున్న కల్తీ శివ శంకర్ రెడ్డి, వైయస్సార్ కడప జిల్లా అట్లూరు మండలం ముత్తుకూరు కి చెందిన బోవిల్ల రాధాకృష్ణారెడ్డిగా గుర్తించడం జరిగిందన్నారు. ఆన్లైన్ బెట్టింగులకు సంబంధం ఉన్న నరసింహులు,రాజేష్ అనే ఇరువురిని పట్టుకొనేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

# గంగవరం మండలంలో నులిపురుగుల నివారణ కార్యక్రమం విజయవంతం

**-98% మంది పిల్లలకు ఆల్బెండజోల్ పంపిణీ**



గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 17:
జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గంగవరం మండలంలోని మర్రిపాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమాన్ని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. చిన్నారుల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలవ్యాప్తంగా 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల మొత్తం 4,798 మంది పిల్లలను లక్ష్యంగా నిర్దేశించారు. ఇందులో 98 శాతం మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను విజయవంతంగా పంపిణీ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. మిగిలిన పిల్లలకు కూడా తప్పనిసరిగా మందులు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామాలలో ఎవరికైనా ఈ మాత్ర అందకపోయినా, లేదా కార్యక్రమం రోజున గ్రామంలో లేకపోయినా, ఫిబ్రవరి 24న నిర్వహించే 'మాప్-అప్ రౌండ్'లో ఆల్బెండజోల్ మాత్రను తీసుకోవాలని అధికారులు కోరారు. పిల్లలలో నులిపురుగుల నివారణ ద్వారా రక్తహీనత తగ్గి, శారీరక మరియు మానసిక ఎదుగుదల మెరుగుపడుతుందని వివరించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ భావన, డాక్టర్ శ్వేత, డాక్టర్ నిహిత మాట్లాడుతూ, తల్లిదండ్రులు పిల్లలకు తప్పనిసరిగా ఈ మాత్ర వేయించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమం విజయవంతం కావడానికి ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసినట్లు తెలిపారు.



# వైభవంగా శ్రీ పరశురామేశ్వరుని గిరి ప్రదక్షణ...





ఏర్పేడు: ఫిబ్రవరి 17, పెన్ పవర్
తిరుపతి జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రం గుడిమల్లం శ్రీ పరశురామేశ్వర స్వామి వారి గిరి ప్రదక్షణ మహోత్సవం అత్యంత వైభవంగా మంగళవారం జరిగింది. సుమారు 27 కిలోమీటర్ల మేర సాగిన ఈ పాదయాత్రలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. గిరి ప్రదక్షిణి సాగిన ప్రతి గ్రామంలోనూ గ్రామస్తులు అడుగడుగున స్వామివారికి మంగళ వాయిద్యాలు మేళ తాళాల నడుమ ఘన స్వాగతం పలికారు. గోవిందవరం గ్రామంలో స్వామివారికి భక్తులు బ్రహ్మరథం పట్టారు అక్కడ స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గిరి ప్రదక్షణలో పాల్గొన్న భక్తుల సౌకర్యార్థం గోవిందవరంలో ఏర్పేడు మండల టిడిపి అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ వేడుకలలో గుడిమల్లం ఆలయ చైర్మన్ బత్తల గిరినాయుడు, ధనుంజయులు నాయుడు తోపాటు మండల కూటమి నాయకులు కార్యకర్తలు మరియు వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో సాగిన ఈ గిరి ప్రదక్షణతో గుడిమల్లం పరిసర ప్రాంతాలన్నీ శివనామ స్మరణతో మారుమోగాయి.



**గిరి ప్రదక్షణ విశేషాలు**

తిరుపతి జిల్లా గుడిమల్లం శ్రీ పరశురామేశ్వర స్వామి ఆలయం నుండి జరిగిన గిరి ప్రదక్షణలో భక్తులు స్వామి వారిని అడుగడుగున దర్శించి ఆనందం పొందారు. ప్రాచీన శివలింగం ప్రత్యేక ప్రాముఖ్యత కలిగిన ఈ యాత్రలో గ్రామస్తులు జననీరాజనం పలికి భక్తి సాగరంలో మునిగారు.

**గ్రామాల్లో ఉత్సవ రంగం..**

ప్రతి గ్రామంలో శ్రీ పరశురామేశ్వరుడికి మంగళ వాయిద్యాలు మోగించి భక్తులు స్వాగతం పలికారు. అడుగడుగున పలికిన జన నీరాజనం సంగీతంతో గ్రామాలు ఉల్లాసంగా మారాయి ఈ పురాతన ఆలయం చుట్టూ జరిగిన ఈ ఘటన భక్తులకు అనుపమ దర్శన భాగ్యాన్ని అందించింది.



**ప్రదర్శన మార్గం..**

తిరుపతి జిల్లా గుడిమల్లం నుండి ప్రారంభమైన ఈ గిరి ప్రదక్షణ 27 కిలోమీటర్ల పొడవుతో విస్తరించింది ప్రాచీన శ్రీ పరశురామేశ్వరుడు గ్రామాల మార్గంలో అడుగడుగున భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

**భక్తుల ఉత్సాహం**

ప్రతి గ్రామంలో శ్రీ పరశురామేశ్వరుడికి మంగళ వాయిద్యాలు మోగించి భక్తులు ఘన స్వాగతం పలికారు. అడుగడుగున పలికిన జన నిరాజనం సంగీతంతో గ్రామాలు భక్తి భావంతో శివనామ జపం చేస్తూ ప్రజలు హరహర మహాదేవ అంటూ నినాదాలు చేశారు.

# ఆన్లైన్ బెట్టింగ్ పై జిల్లా పోలీసుల ఉక్కుపాదం.

తిరుపతి/పెన్ పవర్/ ఫిబ్రవరి 17
– తిరుపతి జిల్లాలో ఆన్లైన్ బెట్టింగ్ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని, ఇటువంటి అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బారాయుడు ఐపిఎస్,గారు ఇదివరకే స్పష్టమైన ఆదేశాలు జారిచేసి ఉన్నారు తెలిపారు.
ఈ నేపథ్యంలో తిరుపతి పట్టణం బైరాగిపట్టెడ పద్మావతి పార్క్ సమీపంలో ఆన్లైన్ క్యాసినో మరియు క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి, వారి వద్ద నుండి రూ.7,48,000 నగదు, ఒక ల్యాప్‌టాప్, 04 మొబైల్ ఫోన్లు మరియు 04ఖ్యువ్ఎ ఞ= కోడ్ బాక్సులను స్వాధీనం చేసుకున్నారు.

జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు, డీఎస్పీ ఎం.భక్తవత్సలం పర్యవేక్షణలో తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసులు, ఎస్ఐలు ఓ.రామస్వామి, జి.ప్రసాద్ మరియు క్రైమ్ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టి ముద్దాయిలను అరెస్టు చేశారు.

నిందితులు YES.WIN.EXCHANGE మరియు KING EXCHANGE వంటి యాప్‌ల ద్వారా అమాయక ప్రజలను ఆకర్షించి క్యాసినో మరియు క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ కమిషన్ రూపంలో అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. గత సంవత్సరం నుండి ఈ కార్యకలాపాలు కొనసాగిస్తూ అనేక మంది ప్రజలు లక్షల రూపాయలు నష్టపోయినట్లు తెలిసింది. పరారీలో ఉన్న మరికొంతమంది నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.
జిల్లా పోలీసులు హెచ్చరిస్తూ ఆన్లైన్ బెట్టింగ్ యువత భవిష్యత్తును దెబ్బతీసే ప్రమాదకర అలవాటు అని పేర్కొంటూ ప్రజలు, ముఖ్యంగా యువత, క్రింది జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు:

**- ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు:**

- యాప్‌లు లేదా వెబ్‌సైట్లలో బెట్టింగ్, గేమింగ్ పేరుతో డబ్బులు పెట్టవద్దు ఇది పూర్తిగా మోసం.

- సోషల్ మీడియా, వాట్సాప్ ద్వారా వచ్చే "ఈజీ మనీ"



లేదా "గుర్తింపు లేని బెట్టింగ్ లింకులు"ను నమ్మవద్దు.
- ఞ= కోడ్‌లు లేదా వ్యక్తిగత అకౌంట్‌లకు బెట్టింగ్ కోసం డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయవద్దు.
- ఆన్లైన్ బెట్టింగ్ కార్యకలాపాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయండి.
- ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల మొబైల్ వినియోగాన్ని పర్యవేక్షిస్తూ, బెట్టింగ్ మరియు గ్యాంబ్లింగ్ ప్రమాదాల గురించి అవగాహన కల్పించాలి.
- ఆన్లైన్ బెట్టింగ్ నిర్వహించే వారు మాత్రమే కాకుండా, అందులో పాల్గొనే వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీస్ శాఖ హెచ్చరించింది.

# విద్యార్థులకు మెమెంటోలు, బహుమతులు ప్రదానం

గూడూరు, పెన్ పవర్,ఫిబ్రవరి 17:
నెల్లూరు జిల్లా గూడూరు పట్టణంలోని చిల్లకూరు శేషమ్మ మునిసిపల్ హై స్కూల్‌లో సత్యాన్వేషి బ్రూనో బలిదాన దినం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఫిబ్రవరి 17 పురస్కరించుకుని సి.ఎస్.ఎం పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణులైన వారికి జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు.
ఈ సందర్భంగా కార్యక్రమ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, కోపర్నికస్ సిద్ధాంతాలను సమర్థిస్తూ భూకేంద్ర సిద్ధాంతానికి వ్యతిరేకంగా నిలిచిన బ్రూనో సత్యం కోసం ప్రాణత్యాగం చేశారని తెలిపారు. సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని ప్రచారం చేసినందుకు ఆయనను ఇటలీలో సజీవ దహనం చేశారని, మరణానికి ముందు ఏడేళ్లకు పైగా గాలి, వెలుతురు లేని కారాగారంలో కఠిన శిక్ష అనుభవించారని వివరించారు. మత పెద్దలు తన అభిప్రాయాలను వెనక్కి తీసుకుంటే విడుదల చేస్తామని చెప్పినా, తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండి సత్యం కోసం నిలబడ్డారని పేర్కొన్నారు.
బ్రూనోను దహనం చేసిన ప్రదేశంలోనే తరువాత ఆయనకు నిలువెత్తు విగ్రహం ఏర్పాటు చేయడం ద్వారా జరిగిన పొరపాటును గుర్తించారని ఆయన తెలిపారు. ఫిబ్రవరి 17ను 'సత్యాన్వేషణ దినం'గా పరిగణించాలని కోరారు.
విద్యార్థులు చిన్ననాటి నుంచే సత్యం కోసం నిలబడి, విజ్ఞాన శాస్త్రాలపై ఆసక్తి పెంపొందించుకోవాలని జనవిజ్ఞాన వేదిక ఆశిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సి.ఎస్.ఎం ఉన్నత పాఠశాల




ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు చెంచు నారాయణ, రామమోహన్, పురుషోత్తమరావు, సుబ్బారావు, ప్రభాకర్, శ్రీనివాసాచారి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తిలో భూ అమృత్ రైతులతో ముఖాముఖి ప్రకృతి వ్యవసాయం పై అవగాహన సదస్సు

శ్రీకాళహస్తి, పెన్ పవర్, ఫిబ్రవరి,16 :
శ్రీకాళహస్తిలో భూ అమృత్ ఆధ్వర్యంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐఏఎస్ అధికారి, ఏపీఎస్ సిడిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్, రాష్ట్ర అటవీ శాఖ సలహాదారు అంకారావు, మాజీ శాసనసభ్యులు ఎస్ సీ వి నాయుడు హాజరయ్యారు.గ్రామీణ శాస్త్రవేత్తలు చంద్రశేఖర్ నాయుడు, హరిబాబు నాయుడు బృందం ఆధ్వర్యంలో భూ పరిరక్షణ, ప్రకృతి వ్యవసాయం, ఔషధ మొక్కల ప్రాధాన్యతపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్ సీ వి నాయుడు మాట్లాడుతూ, "ప్రకృతిని కాపాడితే అది మనల్ని కాపాడుతుంది. ప్రకృతి సంపద ఎవరి సొంతం కాదు. ప్రకృతి వ్యవసాయం ద్వారా విషతుల్యం లేని ఆహారం తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. భవిష్యత్ తరాలకు ప్రకృతి సంపదలను అందించాల్సిన బాధ్యత మనపై ఉంది" అని అన్నారు.రాష్ట్ర అటవీ శాఖ సలహాదారు అంకారావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రీన్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంట్లో తులసి, వెలుపల వేప చెట్టు ఉండాలని, గ్రామాల్లో రావి, మరి చెట్ల ప్రాధాన్యతను వివరించారు. పర్యావరణాన్ని కాపాడుతూ మొక్కలు పెంచడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.
ఐఏఎస్ అధికారి శివశంకర్ మాట్లాడుతూ, సుస్థిర అభివృద్ధి అంటే ప్రకృతి సంపదను భవిష్యత్ తరాలకు అందించడమేనని అన్నారు. ఆరోగ్యమే అసలైన సంపద అని, కలుషితం లేని ఆహారం కోసం ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ శాస్త్రవేత్తలకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొని ప్రకృతి వ్యవసాయంపై తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం ముఖ్య అతిథులను గ్రామీణ శాస్త్రవేత్తల బృందం, స్థానిక రైతు నాయకులు ఘనంగా సత్కరించారు.



# తిరుమల తిరుపతి దేవస్థానం తరపున శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయంకు పట్టువస్త్రాల ఘన సమర్పణ మహాశివరాత్రి వేళ ఆధ్యాత్మిక వైభవం





శ్రీకాళహస్తి, పెన్ పవర్, ఫిబ్రవరి,16 :
మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల పర్వదినం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరపున శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయంలో స్వామివార్లకు భక్తిశ్రద్ధలతో పట్టువస్త్రాల సమర్పణ ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి టీటీడీ అడిషనల్ ఈఓ వెంకయ్య చౌదరి ముఖ్య అతిథిగా హాజరై స్వామివార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ ఈఓతో పాటు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, ఆలయ పాలక మండలి చైర్మన్, సభ్యులు మరియు కూటమి నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.మహాశివరాత్రి పవిత్ర వేళ ఈ పట్టువస్త్రాల సమర్పణతో శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం మరింత ఆధ్యాత్మిక శోభను సంతరించుకుందని భక్తులు పేర్కొన్నారు. ఆదిదంపతుల కృపాకటాక్షాలు సమస్త ప్రజలపై ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

# శ్రీకాళహస్తిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజలకు తక్షణ న్యాయం







శ్రీకాళహస్తి, పెన్ పవర్, ఫిబ్రవరి ,16 :
శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను ఎమ్మెల్యే స్వయంగా కలుసుకుని వారి సమస్యలు, వినతులను శ్రద్ధగా విన్నారు.
ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, వాటిని వేగవంతంగా పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే వరకు నిరంతరం శ్రమిస్తామని భరోసా ఇచ్చారు.

# శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం



శ్రీకాళహస్తి , పెన్ పవర్, ఫిబ్రవరి,16 :
మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో బాల్యవివాహాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 12వ అదనపు జిల్లా జడ్జి ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.కళ్యాణోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాజేశ్వరరావు, శ్రీరామ్, రజిని, ప్రజ్ఞశ్రీతో పాటు కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు, భక్తులు పాల్గొన్నారు. బాల్యవివాహాలు బాలల శారీరక–మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని, చట్టపరంగా కూడా నేరమని అధికారులు వివరించారు.బాల్యవివాహాల నిషేధ చట్టం2006 ప్రకారం అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండక ముందే వివాహం జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు ఎక్కడైనా తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు లేదా చైల్డ్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. న్యాయసలహాల కోసం 10100 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.ఈ సందర్భంగా భక్తులకు పాంప్లెట్లు పంపిణీ చేసి, "పిల్లల భవిష్యత్తు మన బాధ్యత బాల్యవివాహాలకు నో చెప్పండి" అనే నినాదాలతో ప్రతిజ్ఞ చేయించారు. ధార్మిక వేడుకల వేదికగా సామాజిక మేలుకు సంబంధించిన సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యమని న్యాయవాదులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం భక్తుల్లో మంచి చైతన్యం కలిగించింది.

